క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



జడ్జికి మొక్కను అందజేస్తున్న కలెక్టర్

సిద్దిపేటకమాన్: కోర్టు కాంప్లెక్స్ భవనంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవిని కలెక్టర్ ఎం.మనుచౌదరి శనివారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో న్యాయపరమైన విషయాల గురించి చర్చించారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శివరంజని

హుస్నాబాద్: లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు పరిష్కరించేలా చొరవ చూపాలని ప్రిన్సిపాల్ సివిల్ కోర్టు జూనియర్ జడ్జి శివరంజని పోలీసులకు సూచించారు. సెప్టెంబర్ 28న నిర్వహించే జాతీయ లోక్అదాలత్ సందర్భంగా కోర్టుహాల్‌లో శనివారం డివిజన్‌లోని పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులతో జడ్జి కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకు పెండింగ్ కేసులు పెరిగి పోతున్నాయని, చిన్నచిన్న కేసులను రాజీ మార్గం పరిష్కరించుకోవాలన్నారు. కక్షిదారులపై పోలీసులు ఎలాంటి ఒత్తిడి చేయవద్దని సూచించారు. సమావేశంలో అదనపు జడ్జి విశ్వతేజ్, పీపీ నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తితో ఆర్థికాభివృద్ధి



ధ్రువపత్రం అందజేస్తున్న రజిత

హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పిలుపునిచ్చారు. క్యాంటీన్ యూనిట్ నెలకొల్పుకునేందుకు శ్రీభవానీ గ్రూప్‌లోని పచ్చిమట్ల స్వప్నకు ఎస్‌బీఐ నుంచి రూ.11లక్షల మంజూరైన పత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, రమాదేవి, రాజు ఉన్నారు.

క్రీడాకారులకు చేయూతే లక్ష్యం



ఆర్థిక సాయం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులకు చేయూతనందించి వారి ప్రతిభను వెలికితీయడమే క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పీఈసెట్ ఎంట్రెన్స్‌లో రాష్ట్రస్థాయిలో 29వ ర్యాంకు సాధించిన జాతీయ క్రీడాకారిణి కె.అంజలి వ్యాయామ విద్యను అభ్యసించేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ఫౌండేషన్ సభ్యులు శనివారం ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం హైదర్‌పటేల్ మాట్లాడుతూ క్రీడాకారులు మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు విజయరేఖ, సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, నవీన్, జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు గద్దర్ అవార్డు



అవార్డును అందజేస్తున్న కాశీం, సోమన్న

జగదేవ్‌పూర్(గజ్వేల్): గిద్దె గళం రామ్‌నర్సయ్య ఆధ్వర్యంలో గద్దర్ అవార్డుల మహోత్సవం వరంగల్ జిల్లా తొర్రూర్‌లో శుక్రవారం నిర్వహించారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన కళాకారుడు శ్రీనివాస్ కళాకారుల దూంధాంలో పాల్గొని ప్రతిభ చాటారు. ఆయనకు ప్రొఫెసర్ కాశీం, ఏపూరి సోమన్న అవార్డు అందించారు.

ప్రభుత్వ బడి.. సమస్యల ఒడి

- టాయ్‌లెట్‌లు, వంట షెడ్లులు కరువు
- స్కూల్ ఆవరణలో పశువులు సంచారం
- ఆరుబయటే మధ్యాహ్న భోజనం



పిల్లర్ల దశలో ఆగిపోయిన టాయ్‌లెట్‌ల నిర్మాణం

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గ గ్రామంలోని ఉన్నత పాఠశాల సమస్యలు వలయంలో చిక్కుకుంది. పట్టించుకునే నాథుడు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో అత్యధిక విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్న పాఠశాలల్లో మర్పడ్గ హైస్కూల్ ఒకటి. 140 మంది విద్యార్థుల్లో 75మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

మూత్రశాలలు లేక ఇబ్బందులు..

హైస్కూల్ శిథిలావస్థకు చేరడంతో సుమారు మూడేళ్ల కిందట అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మోడల్ హైస్కూల్‌ను అరకొర వసతులతో నిర్మించి ప్రారంభించింది. ప్రహరీ, కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్, మూత్రశాలల లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ శివారులో ఈ స్కూల్ ఉండడంతో పాఠశాల ఆవరణలో నిత్యం పశువులు, గొర్రెలు, మేకలు, కుక్కలు సంచరిస్తుంటాయి. అలాగే విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని ఆరుబయటే తినాల్సిన పరిస్థితి. మూత్రశాలలు లేకపోవడంతో ఒంటికి వస్తే ఇంటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు.

అర్ధాంతరంగా ఆగిన పనులు

వంట షెడ్డు, డైనింగ్ హాల్, మూత్ర శాలల నిర్మాణాలను సుమారు రెండేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం 'మన ఊరు– మన బడి' పథకంలో భాగంగా రూ.90లక్షలు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టరు కిచెన్ షెడ్డు నిర్మాణానికి గోతులుతీసి వదిలేయగా, టాయ్‌లెట్‌ల నిర్మాణాలకు పిల్లర్లువేసి వదిలేశాడు. ఈ విషయాన్ని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని విద్యార్థులతోపాటు హెచ్ఎం భైరయ్య వాపోయారు.

> **సమస్యలు వాస్తవమే..**
>
> ఈ విషయమై జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డిని వివరణ కోరగా పాఠశాలలో సమస్యలున్న విషయం వాస్తవమేనని, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు.

రిటైర్‌మెంట్ వృత్తికే.. వ్యక్తిత్వానికి కాదు



ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న సీపీ అనురాధ

- పోలీసు కమిషనర్ అనురాధ

సిద్దిపేటకమాన్: రిటైర్‌మెంట్ కేవలం వృత్తికే కానీ.. వ్యక్తిత్వానికి కాదని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో ఎస్ఐగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన ఇంద్రసేనారెడ్డిని ఆమె తన కార్యాలయంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా పోలీసుశాఖలో విధులు నిర్వహించి ఆయన సేవలు మరువలేనివన్నారు. ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని ఆయనకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, తెలంగాణ రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీఐ క్విజ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ఆర్‌బీఐ 90సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా క్విజ్ పోటీలు నిర్వహించనున్నామని, జిల్లాలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు కోరారు. దానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ చేతుల మీదుగా బ్యాంకు అధికారులు శనివారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాల్లోను చదువుతున్న విద్యార్థులు ఈ క్విజ్ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

హన్షితకు దాతల సాయం



హన్షితకు నగదు అందజేస్తున్న యువకులు

సాక్షి ఎఫెక్ట్..

మిరుదొడ్డి(దుబ్బాక): సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని బేగంపేటలో ఇటీవల కుక్కల దాడిలో తీవ్ర గాయాలపాలై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న చిన్నారి హన్షితను ఆదుకోవడానికి దాతలు స్పందించి ఆర్థిక సాయం అందజేశారు. కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి హన్షితకు మెరుగైన వైద్యం అందించలేక తల్లడిల్లుతున్న తల్లిదండ్రుల వైనంపై 29న 'హన్షితను ఆదుకోవాలని వినతి' అన్న సాక్షి మానవీయ కథనానికి యువత స్పందించింది. ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హన్షిత తల్లిదండ్రులకు శనివారం రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే మరి కొందరు ఫోన్ పే ద్వారా సాయం చేశారు. ఇప్పటి వరకు రూ.20వేల ఆర్థిక సాయం అందినట్లు చిన్నారి తల్లిదండ్రులు తెలిపారు. ఒక్కో ఇంజక్షన్ రూ.60వేల వరకు ఉంటుందని, దాతలు స్పందించి ఆర్థిక సాయం చేయాలని వారు వేడుకుంటున్నారు.

చెరువుల భూములను కాపాడాలి

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని చెరువులు, కుంటలు, నాళాల శిఖం భూములను అక్రమదారుల నుంచి రక్షించాలని, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ కోరారు. పార్టీ కార్యాలయంలో శనివారంనిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పట్టణంలోని చెరువులు, కుంటలు, నాళాల శిఖం భూములు కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. హైడ్రా తరహాలో సిడ్రా ఏర్పాటు చేసి భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు.న్నారు. ఆక్రమణదారులపై కలెక్టర్, మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధు, గయాజుద్దీన్, రాశాద్, సందీప్ యాదవ్, నజ్జు పాల్గొన్నారు.

ఆరు టిప్పర్లు పట్టివేత

కొమురవెల్లి(సిద్దిపేట): మండల శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్న ఆరు టిప్పర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని 9మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజుగౌడ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడతూ తమకు వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడి చేశామన్నారు. కొండపాకకు చెందిన రేపాక రాజు, రేపాక భాస్కర్, ఆర్.రాజు, తిరుపాటి రాజు, గురువన్నపేటకు చెందిన తరుణ్, కొనాయిపల్లికి చెందిన డి.జంపయ్య, సిద్దిపేటకు చెందిన శివరాత్రి యాదగిరి, కుకునూర్‌పల్లికి చెందిన సునోజ్ రాజు, మర్పడగకు చెందిన సంపంగి రాజుపై కేసునమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నంగునూరు(సిద్దిపేట): ఓ పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి దాడిచేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రాజగోపాల్‌పేట ఎస్ఐ ఆసీఫ్ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌పోర్స్ పోలీసులతో కలిసి దాడి చేశామని, గ్రామానికి చెందిన కిషన్ పారిపోగ అశోక్, బాబు, రాజు వద్ద నుంచి రూ 4,200 నగదు, రెండు బైకులు, రెండు సెల్‌పోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎవరైనా పేకాట, జూదం ఆడితే తమకు తెలపాలని ఎస్ఐ సూచించారు.

గాంధీజీ విగ్రహానికి వినతి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆరోగ్యమిత్రలు

సిద్దిపేటజోన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 11రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నామని, తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ ఆరోగ్యమిత్రలు శనివారం గాంధీజీ విగ్రహం వద్ద వినతిపత్రం ఉంచారు. అనంతరం మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వాపోయారు. సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, బాలు, రవీందర్ రెడ్డి, రాజు, రాజయ్య, లక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి పూజలు

చిన్నకోడూరు(సిద్దిపేట): శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని చిన్నకోడూరు పెద్దమ్మ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



చెరువును తలపిస్తున్న పాఠశాల ఆవరణ

వర్షం కురిస్తే చెరువే...

- శిథిలావస్థకు చేరిన భవనం
- శ్లాబు లీకేజీ.. గదుల్లోకి చేరుతున్న నీరు
- నీటితో నిండిపోతున్న ఆవరణ



శ్లాబ్ నుంచి లీకవుతున్న వర్షం నీరు

హుస్నాబాద్‌రూరల్: మండలంలో శనివారం కురిసిన వర్షానికి తోటపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ వర్షపు నీటితో నిండి చెరువును తలపించింది. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో శ్లాబ్ నుంచి వర్షపునీరు లీకై తరగతి గదుల్లోకి చేరింది. దీంతో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. చినుకు పడితే చాలు విద్యార్థులు ఆ నీటిని బయకు పంపే పనిలో పడాల్సిన దుస్థితి. కూలిపోయే దశలో ఉన్న పాఠశాల భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, తమ పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాణ్యమైన భోజనం పెట్టండి



నంగునూరు(సిద్దిపేట): మాట్లాడుతున్న సరిత

- తహసీల్దార్ సరిత

నంగునూరు(సిద్దిపేట): సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు హాస్టల్, స్కూల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని తహసీల్దార్ సరిత ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం త్రిసభ్య కమిటీ సభ్యులు తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ లక్ష్మణప్ప, వైద్యాధికారి సరిత పాలమాకుల ఎస్సీ హాస్టల్, స్కూళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, సీజనల్ వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ అనురాధ, వార్డెన్ గణేశ్, హెచ్ఎం రాములు, మహేందర్, అనిత, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): స్థానిక కస్తూర్బా, మోడల్ స్కూళ్లను మండల త్రిసభ్య కమిటీ సభ్యులైన తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్, డాక్టర్ భాగ్యలక్ష్మి సందర్శించారు. పారిశుధ్యం, తాగునీరు, వంటశాలలు, వండిన పదార్థాలను పరిశీలించారు. మోడల్ స్కూల్‌లో సుమారు 20మంది విద్యార్థులు జ్వరంతో ఇంటికెళ్లినట్టు తెలపడంతో సోమవారం పాఠశాలలో క్యాంపు ఏర్పాటుచేసి విద్యార్థులకు వైద్యపరీక్షలు చేయిస్తామని తెలిపారు. పారిశుధ్య నిర్వాహణ కోసం కార్యదర్శి ప్రణీత్‌రెడ్డికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్, పీఓ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు

- డీఐఈఓ రవీందర్‌రెడ్డి



జవాబు పత్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈఓ

సిద్దిపేటఎడ్యుకేషన్: అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ సమష్టిగా కృషిచేస్తేనే ఇంటర్‌లో ఉత్తమ ఫలితాను సాధించవచ్చని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, అధ్యాపకుల హాజరు రిజిస్టర్లు, తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు సమయపాలన పాటించాలన్నారు. రెండో యూనిట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థినుల జవాబు పత్రాలను పరిశీలించారు.

సమయపాలన తప్పనిసరి: డీఈఓ శ్రీనివాస్

దుబ్బాకటౌన్/గజ్వేల్‌రూరల్: ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా సమయపాలన పాటించి, విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. రాయపోల్ మండలం వడ్డేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ఉపాధ్యాయుడు చంద్రయ్య పదవి విరమణ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సవ్వ, సెక్టోరియల్ అధికారి రామస్వామి, గాడిపల్లి భాస్కర్, చంద్రశేఖర్ పా ల్గొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞా పూర్‌లోగల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డివిజన్ పరిధిలోని ఆరు మండలాలలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బందికి డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి యూడైస్‌పై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యూడైస్‌లో వివరాలను పొందు పర్చాలన్నారు.

స్నేహపూర్వకంగా పనిచేస్తా..

- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: సిద్దిపేట ప్రజలు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ యంత్రాంగంతో స్నేహపూర్వక వాతావరణంలో పనిచేసి సత్ఫలితాల సాధనకు శాయశక్తులా కృషిచేస్తానని మున్సిపల్ కమిషనర్, సుడా వైస్ చైర్మన్ ఆశ్రిత్ కుమార్ పేర్కొన్నారు. కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఆయనను ప్రభుత్వం సిద్దిపేట కమిషనర్‌గా బదిలీ చేసింది. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గతంలో మెదక్ ఉమ్మడి జిల్లాలోని జోగిపేట, నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశానన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారులు నూతన కమిషనర్‌ను అభినందించారు. ఆయన కలెక్టర్ మనుచౌదరిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

రైతులు ఆందోళన చెందవద్దు

- గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్

దుబ్బాకటౌన్: రేషన్ కార్డు లేక రుణమాఫీ జరగని రైతులను నిర్ధారించడం కోసం సర్వే నిర్వహిస్తున్నామని గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్ తెలిపారు. రాయపోల్ మండలం మంతూర్‌లో శనివారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసిన నేపథ్యంలో వివిధ కారణాలతో రుణమాఫీ అందని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. మండల వ్యాప్తంగా రుణమాఫీ కానివారు 109 మంది రైతులు ఉన్నారని, వారి ధ్రువపత్రాలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నామని చెప్పారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ నరేశ్, ఏఈఓలు కవిత, ప్రవీణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గజ్వేల్ సీఐ సైదా, ట్రాఫిక్ సీఐ మురళి సూచించారు. పట్టణంలోని ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు ఉన్న రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, గంజాయి, ఇతర మత్తుపదార్థాలు, డ్రగ్స్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ అంబదాస్, ప్రిన్సిపాల్ మెట్టయ్యచౌదరి, భరోసా సెంటర్ సిబ్బంది హరిత, అనూష, షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, సిబ్బంది శ్యామల, లావణ్య, మహేశ్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐ సైదా వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులకు నవరాత్రుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. శాంతియుత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలని సూచించారు.

◆ అప్రమత్తంగా ఉండాలి..

వర్గల్(గజ్వేల్): వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్గల్ మండలం గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ పాతబడిన ఇండ్లలో ఉండేవారు కొద్ది రోజులు తెలిసిన వారి ఇండ్లలో ఉండాలన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎర్తింగ్ వైర్లు ఉన్న చోటికి వెళ్లవద్దని చెప్పారు.

◆ కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ శ్రేణులు



ములుగు(గజ్వేల్): బీఆర్ఎస్ పార్టీకి చెందిన ములుగు మండలం కొత్తూరు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో సీఎం ముఖ్య సలహాదారుడు వేము నరేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి సమక్షంలో శనివారం కొత్తూరు మాజీ సర్పంచ్ బాలేశ్, వార్డు సభ్యుడు నరేశ్, అశోక్‌తోపాటు మరో 100మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ రాజీతో సమస్యల పరిష్కారం

హుస్నాబాద్‌రూరల్: చిన్న సమస్యల కోసం కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీ మార్గంలో రెండు వర్గాలు సమస్యలను పరిష్కరించుకోవాలని మున్సిఫ్ కోర్టు జడ్జి శివరంజని సూచించారు. శనివారం పోతారం (ఎస్) గ్రామంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని ప్రజలకు చట్టాల గురించి వివరించారు. పల్లె ప్రజలు చిన్నచిన్న తగాదాలతో కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బును నష్టపోతున్నారన్నారు. 28న మెగా లోక్అదాలత్ నిర్వహిస్తున్నామని కక్షిదారులు రాజీపడి సమస్యలను పరిష్కరించుకోవాలని చెప్పారు. ఏజీపీ సదానందము, మాజీ ఏజీపీ రామకృష్ణ, న్యాయవాదులు మల్లేశం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ సమన్వయకర్తగా డా.శ్రద్ధానందం

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాంతీయ విద్యాకేంద్రం సమన్వయకర్తగా కళాశాల అర్థశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రద్ధానందం నియామకమయ్యారు. ఈ మేరకు సబంధిత అధికారులు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రిన్సిపాల్ సునీత, సీనియర్ అధ్యాపకుడు మధుసూదన్, గోపాల సుదర్శనం, డా.అనురాధ తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు.

◆ రుణమాఫీపై అనవసర రాద్ధాంతం

దుబ్బాక: రైతులకు ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయడాన్ని ఓర్వలేకనే ప్రతిపక్షాలు అనవసరమైన రాద్ధాంతాలు చేస్తున్నాయని నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేశ్ ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార సంఘం, డీసీసీ బ్యాంకులో ప్రభుత్వం ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ ప్రొసిడింగ్‌లను రైతులకు పంపిణీ చేశారు. ఆయన వెంట మచ్చ శ్రీనివాస్, అనంతుల శ్రీనివాస్, వెంకటస్వామిగౌడ్, యేసు రెడ్డి తదితరులు ఉన్నారు.

◆ మహిళల అభివృద్ధే రోటరీ ధ్యేయం

ములుగు(గజ్వేల్): మహిళల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా రోటరీక్లబ్ కృషి చేస్తోందని ఆ క్లబ్ గజ్వేల్ అధ్యక్షుడు సామల నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని అన్నసాగర్‌లో శనివారం మహిళలకు ఉచితంగా ఐదు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లడుతూ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, సాయిరెడ్డి, కర్ణాకర్‌రెడ్డి జగదీశ్వర్, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.